క్లుప్తంగా

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత



ర్యాలీలో పాల్గొన్న నయనాల కృష్ణారావు తదితరులు

సీటీఆర్ఐ: రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత అని మూల్ నివాసీ సంఘ్ జాతీయ అధ్యక్షుడు నయనాల కృష్ణారావు అన్నారు. పూలే - అంబేడ్కర్ జయంత్యుత్సవాల్లో భాగంగా ఏప్రిల్ 11 నుంచి 14 వరకు బామ్‌సెఫ్, మూల్ నివాసీ సంఘ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం గోకవరం బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి మహిళలు, యువకులతో యూనిఫారంలో గోదావరి గట్టున గల పూలే విగ్రహం వరకూ రాజ్యాంగ పరిరక్షణ ర్యాలీ చేశారు. బామ్‌సెఫ్ కేంద్ర కమిటీ సభ్యురాలు డాక్టర్ పి.కోమల, బామ్‌సెఫ్ నాయకులు ఎ.ఆదినారాయణ, జి.శ్రీనివాస్, భాస్కరరాజు, రేలంగి శేఖర్, కొంకి రమేష్ పాల్గొన్నారు.

వైభవంగా పోలేరమ్మ జాతర

రాజమహేంద్రవరం: మోరంపూడి గ్రామదేవత పోలేరమ్మ జాతర మహోత్సవం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. గరగ నృత్యాలు, కోయనాట్యం, కోబ్రా డ్యాన్స్, తీన్‌మార్, విచిత్ర వేషధారణలతో అమ్మవారిని ఊరేగించారు. ఆలయం నుంచి మోరంపూడి, గణేష్ నగర్ వీధుల మీదుగా జరిగిన ఈ ఊరేగింపు ఆకట్టుకుంది. హుకుంపేట, పిడింగొయ్యి, శాటిలైట్ సిటీ, మోరంపూడి, అరవింద నగర్, గాదాలమ్మ నగర్, బుచ్చియ్య నగర్, కవలగొయ్యి ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ప్రతినిధులు రాయి లక్ష్మణరావు, బాలిన వేణు, లింగం వెంకటేశ్వరరావు, యేమిరెడ్డి సత్యనారాయణ, లింగం చంద్రరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బీఎస్పీ ప్రధాన కార్యదర్శిగా రవిచంద్రమౌళి



రవిచంద్రమౌళికి నియామకపత్రం అందజేస్తున్న విజయకుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): బహుజన సమాజ్ పార్టీ రాజమహేంద్రవరం రూరల్ మండల ప్రధాన కార్యదర్శిగా పాట్నూరి రవిచంద్రమౌళి నియమితులయ్యారు. ఆల్కాట్ గార్డెన్స్‌లోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయకుమార్ ఈ మేరకు రవిచంద్రమౌళికి నియామక ఉత్తర్వులు అందజేశారు. కార్యక్రమంలో రూరల్ అధ్యక్షుడు గద్దం ప్రసాద్, వార్డు ఇన్‌చార్జి కొత్తపల్లి శేఖర్, నాయకులు కొండపల్లి సూరి, దమ్ము కృష్ణ పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల అధ్యాపకుడు శ్రీనివాసరావుకు డాక్టరేట్



శ్రీనివాసరావు

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో జియాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న నర్రా శ్రీనివాసరావుకు డాక్టరేట్ లభించింది. కడప అంతర్గత ప్రావిన్స్ ఆల్కలైన్ అగ్నిశిలలు అనే అంశంపై చేసిన పరిశోధనకు వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి ఆయన డాక్టరేట్ అందుకున్నారు. ప్రొఫెసర్ వి.మాధవన్, ప్రొఫెసర్ కె.డేవిడ్ ఆధ్వర్యంలో ఈ పరిశోధనలు చేశారు. కాగా.. శ్రీనివాసరావుకు పలువురు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

బీజేపీ రూరల్ అధ్యక్షుడిగా ఎన్‌వీబీఎన్ ఆచారి



ఆచారిని అభినందిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు

రాజమహేంద్రవరం రూరల్: బీజేపీ రాజమహేంద్రవరం రూరల్ మండల అధ్యక్షుడిగా పిడింగొయ్యి వెంకటగిరికి చెందిన ఎన్‌వీబీఎన్ ఆచారి నియమితులయ్యారు. హుకుంపేటలోని కరుటూరి శ్రీనివాసరావు నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు బొమ్ముల దత్తు ముఖ్యఅతిథిగా పాల్గొని, మండల అధ్యక్షుడిగా ఆచారిని ప్రకటించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆచారికి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రేలంగి శ్రీదేవి, కరుటూరి శ్రీనివాసరావు, ఆకుల శ్రీధర్, యానాపు ఏసు, పిక్కి నాగేంద్ర, గుర్రాల వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతే జగన్ ధ్యేయం

- ఎంపీ భరత్‌రామ్
- ఘనంగా ఆసరా సంబరాలు



మహిళలకు ఆసరా నమూనా చెక్కు అందజేస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్రంలో మహిళల అభ్యున్నతికి సీఎం జగన్ ఎంతో కృషి చేస్తున్నారని ఎంపీ మార్గాని భరత్‌రామ్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలనా సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో బుధవారం వేంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ మూడోవిడత ఆసరా సంబరాలు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్‌రామ్ మాట్లాడుతూ సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతోందన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కితే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ములు వెళ్లేలా చర్యలు చేపట్టారన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీ రహితంగా పేదరికమే అర్హతగా లబ్ధిదారుల ఎంపిక ఉంటుందన్నారు. పేదలు, మహిళలు ఆర్థికంగా చైతన్యవంతులు కావాలన్నదే జగనన్న ఆశయమన్నారు. మహిళలకు రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారని నాలుగు విడతల్లో నెరవేరుస్తున్నారన్నారు. రాష్ట్రంలో 80,000 మంది మహిళలకు రూ.25 వేల కోట్ల రుణమాఫీని నాలుగు దశలలో చేస్తున్నారన్నారు. ఇప్పటి వరకూ మూడు విడతలు పూర్తయ్యాయన్నారు. 2024 ఎన్నికలలో సీఎం జగనన్నకు సంపూర్ణ మద్దతు ఇచ్చి ఆశీస్సులు అందజేయాలన్నారు. ఈ సందర్భంగా ఆసరా లబ్ధిదారులకు నమూనా చెక్కు అందజేశారు. నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ సత్యవేణి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, గాండ్ల, తెలికుల కార్పొరేషన్ చైర్ పర్సన్ సంకిస భవానీ ప్రియ, పార్టీ నాయకులు పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు, పాలిక శ్రీను, పీతా రామకృష్ణ, డాక్టర్ అనసూరి పద్మలత, సప్పా ఆదినారాయణ, మెప్మా మేనేజర్ రవిశంకర్, డివిజన్ ఇన్‌చార్జులు దూర్వాసుల సత్యనారాయణ, వాకచర్ల కృష్ణ, గాదిరెడ్డి పెదబాబు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో అభివృద్ధి పనులపై చర్చ

ప్రధాన ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం చేపట్టబోయే అభివృద్ధి పనులు, రహదారి విస్తరణ తదితర వాటిపై సంబంధిత అధికారులతో ఎంపీ మార్గాని భరత్ రామ్ చర్చించారు. ఆయన బుధవారం ఆయన ఆర్టీసీ కాంప్లెక్స్‌ను పరిశీలించారు. కాంప్లెక్స్‌లోనూ, ప్రాంగణంలోనూ చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై డీపీటీఓ షర్మిల అశోక, డిపో మేనేజర్ షేక్ షబ్నంను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట సిటీ ప్లానర్ సూరజ్ కుమార్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరహాల బాబు, నగర ప్రణాళిక సూపర్ వైజర్ దీప్తి ఉన్నారు.



కోర్టు ప్రాంగణంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎంపీ భరత్‌రామ్

చలివేంద్రం ప్రారంభం

కంబాలచెరువు: స్థానిక జిల్లా, మేజిస్ట్రేట్ కోర్టుల మధ్య గల ప్రాంగణంలో వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎంపీ మార్గాని భరత్‌రామ్ బుధవారం ప్రారంభించారు. న్యాయవాదులు, కక్షిదారుల సౌకర్యార్థం దీనిని ఏర్పాటు చేశారు. తొలిరోజు సుమారు వందమంది న్యాయవాదులు, 300 మంది కక్షిదారులకు చెరకురసం, మజ్జిగ పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు సాదిక్ హుస్సేన్, లీగల్ సెల్ సభ్యులు పీవీబీఎస్ రాజు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోడి సతీష్ నాయుడు, హసీనా బేగం, వైఎస్సార్ సీపీ నాయకులు స్టాలిన్, మార్గాని సురేష్, సప్పా ఆదినారాయణ, రామారావు చౌదరి, అబ్దుల్, ఆరిఫ్, కాశి శ్రీనివాస్, యార్లగడ్డ అశోక్ కుమార్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజమహేంద్రవరం రూరల్: స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని ఎంపీ కార్యాలయం ఆవరణలో బుధవారం రచ్చబండ కార్యక్రమాన్ని ఎంపీ భరత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రేషన్ కార్డు లబ్ధిదారులకు బియ్యం, నిత్యావసరాలు అందజేసే ఎండీయూ ఆపరేటర్లు తమ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఎంపీ భరత్‌రామ్ వారితో మాట్లాడుతూ సక్రమంగా రేషన్ సరుకులు అందివ్వడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, సీఎం జగన్ ఆశయాలకు, ఆలోచనలకు తూట్లు పొడిచేలా వ్యవహరించవద్దన్నారు. ఆ సంఘ అధ్యక్షుడు ఆరే చిన్ని మాట్లాడుతూ సాంకేతిక సమస్యలు, ఎక్కడో ఒకచోట జరిగిన తప్పిదం వల్ల మొత్తం ఎండీయూ ఆపరేటర్లందరికీ మచ్చ పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. నగరంలో 58 మంది ఎండీయూ ఆపరేటర్లు ఉన్నారని, 108 రేషన్ షాపుల లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తుంటామన్నారు. తమ వచ్చే ఆదాయంతో కుటుంబాలకు పోషించుకోవడం కష్టంగా ఉందని, ఆదుకోవాలని కోరారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- ఎంపీ భరత్‌రామ్
- ఉత్సాహంగా గడపగడపకూ



గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించడమే గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమ లక్ష్యమని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. 46వ డివిజన్ ఇన్‌చార్జి మేడబోయిన సునీల్ ఆధ్వర్యంలో క్వారీ ఏరియాలోని డీమార్ట్ వద్ద నుంచి బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భరత్‌రామ్ ప్రతిఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును తెలుసుకున్నారు. కాలువలు శుభ్రం చేయకపోవడం వల్ల దోమలు పెరిగిపోయాయని మహిళలు చెప్పడంతో.. తక్షణమే కాలువల శుభ్రతకు చర్యలు చేపట్టాలని ఎంహెచ్‌ఓ వినూత్నకు ఆదేశాలిచ్చారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, భవానీ ప్రియ, పోలు విజయలక్ష్మి, తిరగాటి దుర్గ పాల్గొన్నారు.

జగన్ పాలన.. సంక్షేమానికి చిరునామా

- వైఎస్సార్ సీపీ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్
- ఉత్సాహంగా జగనన్నే మాభవిష్యత్తు



19వ డివిజన్‌లో ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న లబ్ధిదారులు, చందన నాగేశ్వర్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సంక్షేమానికి చిరునామాగా మారిందని వైఎస్సార్ సీపీ రూరల్ కో ఆర్డినేటర్, ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్ అన్నారు. రూరల్ నియోజకవర్గంలో ఉన్న నగరపాలకసంస్థ పరిధిలోని 19వ డివిజన్‌లో బుధవారం ఆయన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు కలిగిన లబ్ధిని వివరించారు. ప్రజాసమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. టీడీపీ ప్రభుత్వానికి, వైఎస్సార్ సీపీ పాలనకు ఉన్న తేడాను ప్రజలకు వివరించారు. అనంతరం లబ్ధిదారులు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను ఇళ్లకు, మొబైల్ ఫోన్లకు అతికించుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి మింది నాగేంద్ర, జేసీఎస్ కన్వీనర్ కొప్పిశెట్టి ప్రసాద్ బాబు (రాజమౌళి), ఇన్నీసుపేట బ్యాంకు వైస్ చైర్మన్ గేడి అన్నపూర్ణరాజు, ఆర్యాపురం అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బిల్డర్ చిన్న, పార్టీ నాయకులు దుంప చంద్రారెడ్డి, బాబ్జీ రెడ్డి, శంకర్ రెడ్డి, షేక్ ఇమామ్, అంగాడ సత్యప్రియ, కామరాజు, దమ్ము ప్రసాద్, నాగమణి, వరప్రసాద్, నాగేశ్వరరావు, కేబుల్ శ్రీను, కృష్ణారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న తాతబ్బాయి

రాజమహేంద్రవరం సిటీ: సీఎం జగన్ పాలనలోనే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని వైఎస్సార్ సీపీ నగర ప్రధాన కార్యదర్శి, 5వ డివిజన్ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కుక్క తాతబ్బాయి అన్నారు. బుధవారం కంబాలచెరువు సెంటర్‌లో జగనన్నే మాభవిష్యత్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరువ చేయడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సంక్షేమ వసతి గృహాల పరిశీలన



అంబేడ్కర్ గురుకుల పాఠశాలను పరిశీలిస్తున్న ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయ ప్రతాప్‌రెడ్డి

రాజమహేంద్రవరం రూరల్/ధవళేశ్వరం: మండలంలోని వెల్ఫేర్ హాస్టళ్లను బుధవారం సాయంత్రం ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చిత్తా విజయప్రతాప్‌రెడ్డి పరిశీలించారు. ధవళేశ్వరంలో బాలుర ఉన్నత పాఠశాల సమీపంలోని బాలుర ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను సందర్శించారు. 93 మంది విద్యార్థుల్లో ఈస్టర్‌కు వెళ్లిన 44 మంది రాకపోవడంపై వార్డెన్‌ను ఆరా తీశారు. హాస్టల్ నిర్వహణపై కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంటిగ్రేటెడ్ హాస్టళ్లను మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన అంశాలపై కలెక్టర్‌కు నివేదిక ఇస్తామన్నారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థినులతో మాట్లాడి భోజనం, వసతి సదుపాయాలను తెలుసుకున్నారు. విద్యార్థినులందరూ వసతులు బాగున్నాయని చెప్పడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థినికి రూ.1500తో వాచ్ కొనివ్వాలని అక్కడికక్కడే ప్రిన్సిపాల్ వాణికుమారికి విజయప్రతాప్‌రెడ్డి ఫోన్‌పే చేశారు. డైట్ కళాశాల ఆవరణలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థినుల కోసం వండుతున్న వంటలను రుచిచూసి సంతృప్తి వ్యక్తం చేశారు. సంగీతం క్లాసులో ఉన్న విద్యార్థినులతో కొద్దిసేపు మాట్లాడారు. మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ సంక్షేమ బాలికల పాఠశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సివిల్ సప్లయిస్ ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించి స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి ప్రసాదరావు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి కుసుమ నాగజ్యోతి, మండల విద్యాశాఖాధికారి ఏఆర్‌కేడీ తులసీదాస్, తహసీల్దార్ పైడి చిన్నారావు పాల్గొన్నారు.

జల్‌జీవన్ మిషన్ పనుల ఆలస్యంపై ఆందోళన

కడియం: తొమ్మిది నెలల క్రితం జల్‌జీవన్ మిషన్ నిధులతో చేపట్టిన పనులు ఇప్పటికీ పూర్తికాకపోవడంపై కడియం మండలం మురమండ గ్రామానికి చెందిన దళితపేట వాసులు ఆందోళన చేపట్టారు. ఈ మేరకు బుధవారం గ్రామ సచివాలయం వద్ద నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ తొమ్మిది నెలల క్రితం పైప్‌లైన్లు వేస్తామని రోడ్లను తవ్వేశారన్నారు. గ్రామంలోని మూడుచోట్ల పనులు మంజూరు కాగా, దళితవాడలో పనులను ముందుగా మొదలు పెట్టారన్నారు. అయితే పనుల పేరుతో రోడ్లను తవ్వేసి, అప్పట్నుంచి వాటిని అలాగే వదిలేశారన్నారు. దీంతో రాకపోకలకు కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయాన్ని తాము ఎన్నిసార్లు సంబంధిత కాంట్రాక్టర్లు, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదన్నారు. తమ ఇబ్బందులు అధికారులకు కూడా తెలియాలనే ఉద్దేశ అందుకే సచివాలయానికి కూడా తాళం వేశామన్నారు. కాగా.. ఆందోళన నేపథ్యంలో పంచాయతీ కార్యదర్శి సరోజారాణి, స్థానిక నాయకులు అక్కడకు చేరుకుని, వారితో చర్చించారు. సంబంధిత కాంట్రాక్టు సిబ్బందిని పిలిపించి పరిస్థితిని వారికి వివరించారు. కేంద్రం నుంచి తమకు రావాల్సిన నిధులు అందక పోవడంతోనే పనులు ఆలస్యం అవుతున్నట్లు కాంట్రాక్టు సిబ్బంది ఆందోళన కారులకు వివరించారు. ఏది ఏమైనా గురువారం నుంచి పనులు ప్రారంభించి నెలాఖరు నాటికి పూర్తి చేస్తామని లిఖితపూర్వకంగా వారు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

జార్జిరెడ్డికి నివాళి

కంబాలచెరువు: పీడీఎస్‌యూ వ్యవస్థాపకుడు జార్జిరెడ్డి వర్ధంతి సభ బుధవారం జరిగింది. ఈ సందర్భంగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి కిరణ్ కుమార్ మాట్లాడుతూ 1967లో హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో న్యూక్లియర్ ఫిజిక్స్‌లో జార్జిరెడ్డి చేరేనాటికి క్యాంపస్ అంతా మతోన్మాద శక్తులకు అడ్డాగా ఉందన్నారు. దీనితోపాటు జూనియర్ విద్యార్థులపై ర్యాగింగ్, విద్యార్థినులపై లైంగిక వేధింపులు, వారి నుంచి డబ్బులను బలవంతంగా లాక్కోవడం చేసేవారన్నారు. ఈ అరాచక శక్తులకు వ్యతిరేకంగా జార్జిరెడ్డి పోరాడారన్నారు. అయితే మతోన్మాద గూండాలు, దూల్‌పేట రౌడీలు మాటువేసి 1972 ఏప్రిల్ 14న కామ్రేడ్ జార్జిరెడ్డిని కత్తులతో పొడిచి చంపారన్నారు. జార్జిరెడ్డి ఆశయాల సాధన కోసం విద్యార్థులంతా ఐక్యంగా ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు భాను ప్రసాద్ , దినేష్ కుమార్, ధర్మేష్, శ్రీను, ప్రదీప్, శివ పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో సంక్షేమ వెలుగులు



కొత్తతుంగపాడులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

- ఎమ్మెల్యే జక్కంపూడి రాజా
- కొత్తతుంగపాడులో గడపగడపకూ మన ప్రభుత్వం

రాజానగరం: సీఎం జగన్ రూపొందించిన నవరత్నాలు పథకాలు రాష్ట్రంలో పేదరికాన్ని నిర్మూలించి, పేదల జీవితాలలో వెలుగులు పంచుతున్నాయని ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా అన్నారు. మండలంలోని కొత్త తుంగపాడులో బుధవారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. ఇంటింటికీ వెళ్లి, ప్రజల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో ప్రభుత్వం అమలు చేసిన వివిధ సంక్షేమ పథకాల ద్వారా ఆయా కుటుంబాలకు చేకూరిన ప్రయోజనాలను కరపత్రాల ద్వారా వివరించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలనే కాకుండా ఇవ్వని అనేక హామీలను అమలు చేసిన ప్రభుత్వం తమదని సగర్వంగా చెప్పగలుగుతున్నామన్నారు. సుస్థిర పాలన అందిస్తున్న తమ ప్రభుత్వానికి మరో అవకాశం ఇచ్చి, పేదరిక నిర్మూలనతో పాటు రాష్ట్రాభివృద్ధికి తోడ్పడాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా జలజీవన్ మిషన్ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీటి అందించడానికి రూ. 48 లక్షలతో నిర్మించిన ఓహెచ్ఆర్‌ని ఎమ్మెల్యే జక్కంపూడి రాజా ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోలపాటి వెంకన్న, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ మందారపు వీర్రాజు, కో న్వీనర్ గండి నానిబాబు, స్థానిక నాయకులు ఉల్లంగి సూర్యనారాయణ, రౌతు లక్ష్మీపతి, రైతుల శ్రీను, యాళ్ల గణపతి పాల్గొన్నారు.

లారీ డ్రైవర్‌కు రెండేళ్ల జైలు

కంబాలచెరువు: బాలిక మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు రెండేళ్ల జైలుశిక్ష విధిస్తూ మూడో ఏజేఎఫ్‌సీఎం కోర్టు న్యాయమూర్తి ఎస్.వరలక్ష్మి బుధవారం తీర్పుచెప్పారు. వివరాల్లోకి వెళితే.. గోకవరం హైస్కూల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కొంతమూరుకు చెందిన భూముల వాడవల్లి 2018 అక్టోబర్ 26న తన మోటారు సైకిల్‌పై కుమార్తె (4)ను ఎక్కించుకుని లాలాచెరువు వెళుతోంది. క్వారీ సెంటర్‌కు వచ్చేసరికి ఆమెను లారీ వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ఘటనలో నాలుగేళ్ల పాప లారీ కిందపడి మృతి చెందింది. దీంతో బాధితురాలు వాడవల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన పోలీసులు అధారాలను కోర్టుకు సమర్పించారు. నిజనిర్ధారణ కావడంతో లారీ డ్రైవర్ కొర్రాయి గణపతికి రెండేళ్ల జైలు, రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. కేసును ప్రస్తుత మూడో పట్టణ సీఐ మధుబాబు పర్యవేక్షించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.లక్ష్మీదేవి కేసు వాదించారు.

పేపరుమిల్లుపై నివేదిక ఇవ్వండి

రాజమహేంద్రవరం సిటీ: నిబంధనలు అతిక్రమించి పేపరుమిల్లు రసాయనిక వ్యర్థాలతో గోదావరి నదిని కలుషితం చేస్తున్నారనే ఫిర్యాదులపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ స్పందించింది. ప్రజల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారిన పేపరుమిల్లును మూసివేయాలంటూ గతేడాది అక్టోబర్ 4న రాజమహేంద్రవరానికి చెందిన కొందరు గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించారు. ఫిర్యాదును పరిశీలించిన ఎన్‌జీటీ పేపరుమిల్లు వ్యవహారాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వాలంటూ బుధవారం సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డుకు ఆదేశాలు జారీ చేసింది.

ఊపందుకున్న వరికోతలు

- యంత్రాలతో ముమ్మరంగా పనులు
- కడియం మండలంలో 2,623 హెక్టార్లలో వరిసాగు



దుళ్లలో వరి పంటను కోస్తున్న యంత్రం

కడియం: మండల పరిధిలో వరి కోతలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వేమగిరి, కడియం, జేగురుపాడు, మాధవరాయుడు పాలెం, మురమండ, దుళ్ల, కడియపుసావరం గ్రామాల్లో మొత్తం 2,623 హెక్టార్లలో ప్రస్తుత సీజన్‌లో వరిసాగు చేశారు. వేమగిరిలో సుమారు 50, దుళ్లలో 30, మురమండలో 25, జేగురుపాడులో 30 ఎకరాల్లో మంగళ, బుధవారాల్లో కోతలకు ముహూర్తాలు చేశారు. కోతలు మొదలైన నేపథ్యంలో మొత్తం ఆరు వరకు వరి కోత యంత్రాలు కడియం మండలానికి వచ్చాయని రైతులు చెబుతున్నారు. దీంతో రానున్న వారం రోజుల్లో మరింత ముమ్మరంగా కోతలు ఉంటాయని వెల్లడిస్తున్నారు.

దిగుబడిపై ఆశలు

కడియం ఆవ మినహా మిగిలిన గ్రామాల్లో పంట కాలం ఇప్పటికే పూర్తయింది. దీంతో కోతలు మొదలు పెడుతున్నారు. ఆవలో ఊడ్పులు ఆలస్యం కావడంతో కోతలు కూడా ఆలస్యమవుతున్నాయని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దిగుబడులు కూడా ఆశాజనకంగానే ఉన్నాయంటున్నారు. ప్రస్తుత సీజన్‌లో తెగుళ్ల బెడద గణనీయంగా తగ్గిందని, వాతావరణం కూడా అనుకూలంగానే ఉందంటున్నారు. మండల పరిధిలోని 2,623 హెక్టార్లలో 98 శాతం ఎంటీయూ 1121 రకం వరిని రైతులు సాగు చేశారు. ఆర్ఎస్ఆర్‌తో సహా ఇతర సన్నరకాలను సాగు, విత్తనాల కోసం బొండాల రకాన్ని మిగిలిన రెండుశాతం మంది రైతులు సాగు చేపట్టారు.

నెలాఖరుకు పూర్తి

ఏప్రిల్ నెలాఖరుకు మండల పరిధిలో వరి కోతలు పూర్తవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేస్తున్నారు. ఇతర ప్రాంతాల కంటే ముందుగానే కడియం మండలంలో వరి కోతలు మొదలైన నేపథ్యంలో రానున్న 20 రోజుల్లోనే పూర్తయి, పంట ఒబ్బిడి చేసుకునేందుకు అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉంటుందన్న అంచనాల నేపథ్యంలో రైతులు శరవేగంగా కోతలు చేపడుతున్నారు. మండల పరిధిలో ధాన్యం కొనుగోలుకు అవసరమైన గన్నీబ్యాగులు.. ప్రతిపాదనలకు అనుగుణంగా రెండు రోజుల్లోనే రానున్నాయని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోళ్లు మొదలవుతాయన్నారు.

రాష్ట్రంలో అరాచక పాలన

రాజమహేంద్రవరం రూరల్: రాష్ట్రంలో అరాచక పాలన, పోలీసు రాజ్యం నడుస్తోందని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి విమర్శించారు. బుధవారం ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్ నియంతృత్వ పాలనకు పోలీసు అధికారులు కొమ్ముకాస్తున్నారన్నారు. రాష్ట్రంలో జగన్ సరికొత్త దోపిడీకి తెరలేపారని ఆరోపించారు. రాజమహేంద్రవరంలో మే నెలలో టీడీపీ మహానాడు భారీ స్థాయిలో నిర్వహించి జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటిస్తామని చెప్పారు.